సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 14 । మే । 2023

ఆర్టీసీ సురక్షితమేనా..?



ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఇటీవల బస్సు ప్రమాద ఘటనలు పెరిగిపోయాయి. కార్మికులపై పని ఒత్తిడే కారణంగా తెలుస్తోంది. 8లో▸



కాంగ్రెస్ నాయకుల కొట్లాట

ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇద్దరు బాహాబాహీకి దిగారు. నేతల సమక్షంలోనే దాడులకు పాల్పడ్డారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
44.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉండనుంది.

న్యూస్‌రీల్

విద్వేష రాజకీయాలకు చరమగీతం



టపాసులు కాలుస్తున్న సుజాత, సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్: బీజేపీ చేస్తున్న విద్వేష రాజకీయాలకు కర్ణాటక ప్రజలు చరమగీతం పాడారని ఏఐసీసీ స భ్యురాలు గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వినాయక చౌక్‌లో పార్టీ శ్రేణులు శనివారం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఫలితాలే రాష్ట్రంలోనూ పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. కాగా, సంబరాల సమయంలోనే ఇరువురు పార్టీ నాయకులు బాహాబాహీకి దిగడం చర్చనీయాంశంగా మారింది. అలాగే సాయంత్రం పలువురు పార్టీ శ్రే ణులు పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సి ంగ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, అసెంబ్లీ ప్రెసిడెంట్ హర్షాద్, యూత్ కాంగ్రెస్ ప్ర ధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్, ఉప సర్పంచ్ మల్లయ్య, నాయకులు గజేందర్, వెంకట్ రెడ్డి, వెంకట్, ప్రభాకర్ రెడ్డి, ఆనంద్ రావు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా అధికారుల వ్యవహారం'



రోడ్డుపై మురుగునీటిని పరిశీలిస్తున్న శంకర్

ఆదిలాబాద్: కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ కాలనీని శనివారం ఆయన సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో ప్రణాళిక రహితంగా డ్రెయినేజీల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాలనీలో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు, స్థానికులు ఉన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ

కైలాస్‌నగర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 21 వరకు వేసవి సైన్స్ ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సంతోష్ కుమార్, ఎస్.రవీందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

కనిపించే దైవం

- నిస్వార్థ సేవకు ప్రతీక
- అమ్మ ఆప్యాయత..అనిర్వచనీయం
- నేడు మాతృ దినోత్సవం

అమ్మ.. సృష్టికి మూలం. నిస్వార్థ ప్రేమకు చిరునామా. రెండక్షరాల ఈ పదం కన్నా గొప్పది మరోటి లేదు. నవ మాసాలు మోసి కని పెంచే ఆ మాతృమూర్తి అందించే ఆప్యాయత అనిర్వచనీయం. పిల్లలు వైకల్యంగా ఉన్నా గుండెలకు హత్తుకొని మాతృత్వాన్ని చాటుతోంది. తోడు దూరమైనా పేగు బంధాన్ని ఆకాశమంత ఎత్తున నిలబెట్టేందుకు అహర్నిషలు ఆరాటపడుతోంది. బిడ్డల ఉన్నతే తన జీవితంగా భావించే తల్లికి ఎంత చేసినా తక్కువే. మదినిండా కొలువైన అమ్మను నిత్యం స్మరించేందుకు ఓ కొడుకు ఏకంగా గుడినే కట్టించాడు. అందుకే కాబోలు కనిపించే దైవం అమ్మ అంటారు.
– ఆదిలాబాద్‌టౌన్





అమ్మకోసం నిర్మించిన ఆలయం ఇదే..

గొడుగుల పొచ్చుబాయి(ఫైల్)

అమ్మకు ఆలయం...

జైనథ్: జన్మనిచ్చిన తల్లిని బతికినంత కాలం ఆప్యాయంగా చూసుకోవడమే కాకుండా, చనిపోయిన తరువాత కూడా ఆలయం నిర్మించి అమ్మపై ఉన్న ప్రేమను చాటాడు ఈ కుమారుడు. మదినిండా కొలువైన మాతృమూర్తి చిత్రపటాన్ని కోవెలలో ఉంచి నిత్యం దైవంగా పూజిస్తున్నాడు. ఆయనే జైనథ్ మండల కేంద్రానికి చెందిన సామన్య రైతు గొడుగుల సత్యనారాయణ. పొచ్చుబాయి–మల్కన్న కు ఈయన నాల్గో సంతానం. ఇద్దరు అక్కలు, ఒక అన్న. అప్పటికే వారి పెళ్లిల్లు అయిపోయాయి. ఈ క్రమంలో 17 ఏళ్ల క్రితం తండ్రి చనిపోయాడు. అప్పటికే సత్యనారాయణ పెళ్లి కూడా అయిపోయింది. భర్తను కోల్పోయిన పొచ్చుబాయి ఒంటరైపోయింది. ఎప్పుడూ తనలో తాను దిగాలుగా ఉంటున్న తల్లిని ఓదార్చి తన ఇద్దరు పిల్లల్లాగానే చూసుకోవడం ప్రారంభించాడు. ఆమె బతికి ఉన్నంత కాలం ఆప్యాయంగా చూసుకున్నాడు. 2013లో ఆమె తనువు చాలించడంతో ఒక్కసారిగా తీవ్ర ఆవేదన చెందాడు. కొంతకాలం అమ్మ ధ్యాసలోనే గడిపాడు. భార్య వాణి, పిల్లలు మణిదీప్, సాహితీల ప్రోద్బలంతో తల్లి జ్ఞాపకా ర్థం గుడి కట్టాలని భావించాడు. అనుకున్నదే తడవుగా తన చేనులో ఓ ఆలయం నిర్మించాడు. చుట్టూ అమ్మ గొప్పతనాన్ని చాటేలా సూక్తులు రాయించాడు. అందులో అమ్మ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేస్తున్నాడు.

ఆత్మ సంతృప్తి కోసమే..



ఎవరికో ఆత్మబోధ కలిగించాలనో.. మరెవరికో స్ఫూర్తిగా నిలవాలనో.. నేను మా అమ్మకు గుడి కట్టించలేదు. అమ్మను బతికి ఉన్నంత కాలం సంతోషంగా ఉంచేందుకు ప్రయత్నించా. ఆమె ఒక్కసారిగా నన్ను వీడిపోవడంతో జీర్ణించుకోలేక పోయా. కానీ అది దైవ నిర్ణయం. అందుకే భౌతికంగా దూరమైన నా తల్లి మాతోటే ఉండాలని గుడి కట్టించాను. ఇది నాకు చాలా ఆత్మసంతృప్తినిచ్చింది. – గొడుగుల సత్యనారాయణ

కూతురు కోసం.. స్పెషల్ బీఈడీ



వైకల్యంగల చిన్నారులకు ఆటలు ఆడిస్తున్న అనిత



కూతురు సర్వజ్ఞతో అనిత

ఆదిలాబాద్ పట్టణంలోని రాం నగర్‌కు చెందిన అనిత–దయాకర్ రెడ్డి దంపతులకు 2013లో కూతురు సర్వజ్ఞ జన్మించింది. మూడేళ్లయినా మాట్లాడకపోవడం.. అలాగే వినబడకపోవడంతో వైద్యులను సంప్రదించారు ఆ పేరెంట్స్. చిన్నారి మూగ, చెవిటి సమస్యతో బాధపడుతుందని వైద్యులు నిర్ధారించారు. ఏ విషయం చెప్పినా పాపకు అర్థం కాకపోయేది. ఈ క్రమంలో చిన్నారిని పట్టణంలోని భవిత సెంటర్‌లో చేర్పించారు. అయితే బిడ్డకు ఇంటి వద్ద చదువు నేర్పించాలనే ఉద్దేశంతో ఆ తల్లి ఏకంగా స్పెషల్ బీఈడీ కోర్సు చేసింది. అంతకు ముందు రెగ్యులర్ బీఈడీ చేయగా, పాప భవిష్యత్తు కోసం ఈ నిర్ణయం తీసుకుంది. అంతే కాకుండా స్థానిక భవిత సెంటర్‌లో రెండేళ్లుగా సేవాభావంతో ఉచితంగా 15 మంది మూగ, చెవిటి చిన్నారులకు బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తుంది ఈ మాతృమూర్తి. సకలాంగులకు విద్యాబోధన సులువే అయినా వీరికి శిక్షణ ఇవ్వడం కఠినతరమే. చేతులతో సైగలు చేస్తూ చిన్నారుల భవితకు మార్గం చూపెడుతుంది ఈ అమ్మ.

బిడ్డ చదువుకోసం.. పాచిపని చేస్తూ..



కూతురు స్వప్నతో తల్లి హన్మక్క

ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉండే హన్మక్క ఇళ్లలో పాచిపని చేస్తూ తన కూతురును ఉన్నత చదువులు చదివిస్తోంది. భర్త హన్మంతు 2010లో చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ తనపై పడింది. తాను పడ్డ కష్టాలు బిడ్డలకు రావొద్దని భావించి ఉదయం లేచిన వెంటనే ఇళ్లలోకి వెళ్లి పనులు చేస్తుంది. ఈమెకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు రేఖ వివాహం కాగా, కుమారుడు గణేశ్‌ను ఐటీఐ చదివించింది. చిన్న కూతురు స్వప్న పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసింది. ప్రిన్సిపాల్ సూచన మేరకు ఎంసెట్ రాయగా, ఆమెకు వరంగల్‌లో ఇంజినీరింగ్ సీటు లభించింది. ప్రస్తుతం బీటెక్ ఫైనలియర్ చదువుతుంది. అప్పుసొప్పు చేసి బిడ్డల భవిష్యత్తుకు పాటుపడుతున్న ఈ మాతృమూర్తిని అందరూ అభినందిస్తున్నారు.

కూతురికే సమయం కేటాయించాలని..



కూతురు రష్మీ, భర్త అశోక్‌తో డాక్టర్ రమ

మా ఆయన అశోక్ రిమ్స్ సూపరింటెండెంట్‌గా, నేను గైనకాలజిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్నాను. మాకు ఒక్కగానొక్క కూతురు రష్మీ. ఆమె పదో తరగతిలో ఉన్న సమయంలో పేషెంట్లు ఉన్నా మధ్యాహ్నం సమయం కేటాయించి దగ్గరుండి భోజనం పెట్టేదాన్ని. ఒకే కూతురుకు సమయం కేటాయించాలని మరొకరు కావాలనుకోలేదు. మా పాప ఇప్పుడు రేడియాలజిస్ట్. ఆమె చదువుకునే రోజుల్లో ఇద్దరం ప్రత్యేకంగా సమయం కేటాయించేవాళ్లం. సెలవుల్లో అందరం కలిసి టూర్‌కు వెళ్లేవాళ్లం. సమాజం పట్ల అవగాహన కల్పించేవాళ్లం. ఏది మంచి.. ఏది చెడు అనే విషయాలను వివరించేవాళ్లం. బిడ్డల ఎదుగుదలలో తల్లుల పాత్ర ఎంతో ఉంటుంది.

వైద్య వృత్తిలో బిజీగా ఉన్నా..



భర్త, పిల్లలతో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

మా ఆయన డాక్టర్ మనోహర్ అదనపు డీఎంహెచ్‌వోగా, నేను డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్నాం. వృత్తి పరంగా ఇద్దరం బిజీ అయినా పిల్లలను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. ప్రస్తుతం కూతురు యుక్తా మెడిసిన్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కుమారుడు సాకెత్ ఇంజినీరింగ్ చేస్తున్నాడు. సెలవులు, పండుగల సమయంలో వారితో ఆనందంగా గడుపుతాం. చిన్నతనంలో వారు స్కూల్‌కు వెళ్లొచ్చిన తర్వాత హోంవర్క్ రెగ్యులర్‌గా చూసేదాన్ని. సమాజంలో గౌరవంగా ఏ విధంగా ఉండాలనే విషయాలను ఎప్పుడు చెబుతుంటా. పిల్లలు తప్పు దారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అమ్మదే.

ఆదర్శం .. సంతపురి చిన్నక్క



పిల్లలతో కలిసి చిన్నక్క

తాంసి: ఆస్తిపాస్తులు లేకున్నా తండ్రి లేడనే బాధ పిల్లలకు తెలియకుండా వారిని పెంచి ఉన్నత చదువులు చదివించి ఆదర్శంగా నిలుస్తోంది ఈ అమ్మ. తాంసి మండల కేంద్రానికి చెందిన సంతాపురి చిన్నక్క–పోశెట్టి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు సంతానం. పిల్లలు ఎదుగుతున్న సమయంలో పోశెట్టి మృతి చెందాడు. ఈ క్రమంలో కన్నీళ్లను దిగమింగి వారికి తండ్రి లేడనే బాధ తెలియకుండా కూలి పనులు చేస్తూ ఉన్నత చదువులు చదివించింది ఆ తల్లి. ప్రస్తుతం రెండో కూతురు కేజీబీవీలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తుంది. చిన్న కూతురు డీఎడ్ పూర్తి చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తుంది. కుమారుడు శ్రీకాంత్ సైతం డీఎడ్‌తో పాటు బీఎడ్ పూర్తి చేసి ప్రస్తుతం ఓయూలో ఎంఏ హిస్టరీ చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. తోడు దూరమైనా పిల్లలను ఉన్నతంగా చదివించిన ఈ తల్లి పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది.

పిల్లల చదువుకోసం కూలీ పనికి..



కుమారుడితో లంక పద్మ, మావల

కూలీ నాలీ చేస్తూ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దింది ఈ మాతృమూర్తి. బోథ్‌కు చెందిన లంక పద్మ–రాజన్న దంపతులకు ముగ్గురు సంతానం. రాజన్న మానసిక అనారోగ్యంతో బాధపడేవాడు. దీంతో కుటుంబ భారమంతా పద్మనే చూసుకునేది. బోథ్ నుంచి మావలకు వచ్చి స్థిరపడి కూలినాలి చేస్తూ పిల్లలను కష్టపడి చదివించింది. ప్రస్తుతం పెద్ద కూతురు ఆనూషను టీచర్‌గా, కుమారుడు మల్లయ్యను ఏఆర్ కానిస్టేబుల్‌గా, చిన్నకూతురు సునీత టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ డిగ్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. కష్టాలను దిగమించి పిల్లలను ప్రయోజకులను చేసిన ఈ అమ్మకు సెల్యూట్ చేయాల్సిందే.

వెనక్కి తగ్గిన జేపీఎస్‌లు

- గడువులోపు 22 మంది లేఖలు సమర్పణ
- మిగతా వారితో రాత్రి చర్చలు జరిపిన అధికారులు
- అందరూ విధుల్లో చేరినట్లు ప్రకటించిన యంత్రాంగం
- సమ్మె విరమించలేదని చెప్పిన జేపీఎస్ నేతలు
- నేటి ఉదయం వరకు సమయం కోరామని వెల్లడి



విధుల్లో చేరుతున్నట్లు డీపీవోకు లేఖలు అందజేస్తున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో 16 రోజులుగా కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ ఆదేశాలతో వెనక్కి తగ్గారు. శనివారం మధ్యాహ్నం 12గంటల్లోపు విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయితే ఆ గడువులోపు జిల్లాలో 22మంది జేపీఎస్‌లు మాత్రమే విధుల్లో చేరుతున్నట్లుగా ఆయా మండలాల ఎంపీడీవోలకు లిఖితపూర్వకంగా లేఖలు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు జిల్లా పంచాయతీ కార్యాలయంలో బైఠాయించి జేపీఎస్, ఓపీఎస్‌ల కోసం ఎదురుచూశారు. విధుల్లో చేరిన వారి నుంచి లేఖలు స్వీకరించారు. కాగా మిగతా జేపీఎస్, ఓపీఎస్‌లు మాత్రం సాయంత్రం వరకు ఎప్పటిలాగే సమ్మె శిబిరంలో బైఠాయించి నిరసన తెలిపారు. రాత్రి 7.30గంటలకు సమ్మెలో ఉన్న వారిని జిల్లా అధికారులు చర్చలకు పిలిచారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా పంచాయతీ అధికారి పి.శ్రీనివాస్ స్థానిక డీఆర్డీవో సమావేశ మందిరంలో వారితో చర్చించారు. ప్రభుత్వ ఆదేశాలు, విధుల్లో చేరకుంటే ఎదురయ్యే పరిణామాలను వారికి వివరించారు. వారి సూచనతో వెనక్కి తగ్గిన కొంతమంది జేపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరనున్నట్లుగా ప్రకటించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌కు తాము విధుల్లో చేరుతున్నట్లుగా పలువురు లిఖితపూర్వక లేఖలు అందజేశారు. ఈవిషయమై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా జిల్లాలో పనిచేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లంతా విధుల్లో చేరారన్నారు. జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌ను సంప్రదించగా కొంతమంది మాత్రమే విధుల్లో చేరుతున్నట్లుగా లేఖలు అందజేశారన్నారు. అధికారులతో జరిగిన చర్చల్లో ఆదివారం ఉదయం 11గంటల వరకు విధుల్లో చేరేందుకు తాము సమయం కోరామన్నారు. ఉదయం తమ రాష్ట్ర కమిటీతో సంప్రదించి సమ్మె విరమణపై తుది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. అప్పటి వరకు కలెక్టరేట్ ఎదుట టెంట్ యథావిధిగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఏజెన్సీ అలవెన్స్ లూటీ!

- సీఎంజీవీ బోర్‌వెల్ కనెక్షన్ వర్క్‌లలో అంతా అక్రమమే
- నామినేషన్ పనులకు కూడా వర్తింపు
- ఇదివరకు టెండర్ ద్వారా ఇచ్చే వాటికే..
- విద్యుత్ శాఖలో తవ్వినకొద్దీ బాగోతాలే

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్‌శాఖలో ఏజెన్సీ అలవెన్స్ లూటీ యథేచ్ఛగా సాగుతోంది. సీఎం గిరి వికాసం (సీఎంజీవీ) పథకం కింద నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్ వర్క్‌లలో ఇది బాహాటంగా జరుగుతుంది. ఇది వరకు ఈ శాఖలో టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ ద్వారా పనులు అప్పగిస్తేనే ఈ అలవెన్స్ వర్తింప చేసేవారని శాఖలోనే చెబుతున్నారు. అలాంటిది ప్రస్తుతం గిరి వికాసంపనుల్లో నామినేషన్‌పై ఇచ్చే పనులకు కూడా దీన్ని వర్తింప చేయడం ద్వారా పెద్ద మొత్తంలో అవినీతికి తెరలేసిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పేదలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసే పనులను డీఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ నుంచి విద్యుత్ శాఖకు అప్పగించగా ఇలాంటి వ్యవహారాలతో జిల్లా యంత్రాగానికి మచ్చ తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తున్నారన్న అపవాదు వ్యక్తం అవుతోంది.

ఏమిటి ఈ ఏజెన్సీ అలవెన్స్..

గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో పనులు నిర్వహించడం కొంత ఇబ్బందితో కూడిన వ్యవహారం. సరైన రవాణా సౌకర్యాలు ఉండకపోవడం, సామగ్రిని అక్కడి వరకు తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ సంబంధించిన వర్క్‌లకు అంచనా విలువపై 25 శాతం అదనంగా ట్రైబల్ అలవెన్స్ ఇవ్వడం ద్వారా ఆ కాంట్రాక్టర్‌కు నష్టం కాకుండా చూస్తారు. అయితే ఇప్పటి వరకు టెండర్ ద్వారా అగ్రిమెంట్ చేసుకుని పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు దీన్ని వర్తింప చేసేవారని విద్యుత్ శాఖలో పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం మాత్రం సీఎంగిరి వికాసం పనులకు సంబంధించి ఉట్నూర్ డివిజన్‌లోని ఏజెన్సీ ప్రాంతంలో వివిధ సెక్షన్లలో నామినేషన్‌పై చేపట్టే కాంట్రాక్టర్లకు కూడా ఈ అలవెన్స్‌ను కట్టబెట్టడం వెనుక అధికారుల స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

టెండర్‌లో కిటుకు..

టెండర్లలో జిమ్మిక్కులు చేయడం ద్వారా ఇక్కడ నామినేషన్‌పై పనులను అప్పగించే విధంగా అధికారుల శైలి ఉందన్న విమర్శలు విద్యుత్ శాఖలో వ్యక్తం అవుతున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. నార్నూర్ సెక్షన్‌లో టెండర్ వర్క్‌కు సంబంధించి రిజర్వేషన్ ఎస్సీకి ఖరారు చేయగా అక్కడ ఎస్టీ వాళ్లే ఉండటంతో టెండర్‌లలో ఎవరూ పాల్గొనలేదు.ఒక బిడ్ కూడా దాఖలు కాలేదు. ఇలా కిటుకు ఉపయోగించిన ఆశాఖ అధికారులు అక్కడ టెండర్ చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదంటూ చెబుతున్నారు.ఇలా ఉట్నూర్ డివిజన్‌లో ఇంద్రవెల్లి సెక్షన్ మినహాయిస్తే మిగతా గుడిహత్నూర్, ఉట్నూర్, సిరికొండ, నార్నూర్ సెక్షన్లలో పలు వర్క్‌లను నామినేషన్‌పై అప్పగించారు. ఇంద్రవెల్లిలో కూడా కొన్ని పనులనే టెండర్ చేపట్టి మిగతావాటి విషయంలో ఇలాంటి పరిస్థితే ఉంది. ఇలా నామినేషన్‌పై తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్‌కు పనులు కట్టబెట్టేందుకు అధికారులు ఇలాంటి జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారన్నఆరోపణలు లేకపోలేదు. మొత్తంగా ఏజెన్సీ అలవెన్స్‌ను లూటీ చేస్తున్నారు.ఉట్నూర్ డివిజన్‌లో ఇప్పటికీ పదుల సంఖ్యలో పనులకు సంబంధించి టెండర్లు నిర్వహించామని చెబుతున్న అధికారులు వాటిని పైనపేర్కొన్న విధంగా పలు కిటుకుల ద్వారా నామినేషన్‌పై అప్పగించారని అపవాదు వ్యక్తమవుతుంది.

అన్ని పనులకు ఏజెన్సీ అలవెన్స్

ఉట్నూర్ డివిజన్‌లో 127 సీఎం గిరి వికాసం పనులకు సంబంధించి 77 పనులకు టెండర్లు చేశాం. 50 పనులను నామినేషన్‌పై అప్పగించాం. ఏజెన్సీ అలవెన్స్ అన్ని పనులకు వర్తింప చేశాం. – సుభాష్, డీఈ, ఉట్నూర్ డివిజన్

క్లుప్తంగా

బాసరలో భక్తుల రద్దీ



బాసర ఆలయంలో భక్తుల సందడి

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరి నదిలో స్నానాలాచరించి సూర్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షర శ్రీకార మండపంలో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు.

సెల్‌పాయింట్‌లో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

కడెం: మండల కేంద్రానికి చెందిన దుర్గం మల్లేశ్ సెల్ పాయింట్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సెల్‌ఫోన్‌లు, సామగ్రి కాలిపోయాయి. దీంతో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు మల్లేశ్ పేర్కొన్నాడు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామ చెరువులో ప్రమాదవశాత్తు గంగాబాయి (75) వృద్ధురాలు మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... తానూరు మండలంలోని హంగిర్గ గ్రామానికి చెందిన గంగాబాయి శనివారం భైంసా మండలంలోని ఇలేగాంలో తన కూతురి వద్దకు వెళ్లే క్రమంలో దారి తప్పి కామోల్‌కు వెళ్లింది. ప్రమాదవశాత్తు దారి పక్కనే ఉన్న చెరువులో పడి మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ సురక్షితమేనా..?

'ఏప్రిల్ 6వ తేదీన మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఆదిలాబాద్ డిపోకు చెందిన కండక్టర్ బాతూరి గంగారం (54) మృతి చెందడం విషాదాన్ని నింపింది. మంచిర్యాల డిపోకు చెందిన డ్రైవర్ హైదరాబాద్ నుంచి బస్సు నడిపి డిపోలో నిలిపివేసే క్రమంలో మధ్యాహ్న భోజనానికి వెళ్తున్న గంగారంను చూసుకోకుండా వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని గుర్తించారు. విశ్రాంతి లేకుండా బస్సును నడిపి విధులను త్వరగా ముగించుకోవాలనే తొందరపాటుతో నిండు ప్రాణం బలైందని ఆర్టీసీ డ్రైవర్లు కలత చెందారు.'

'ఏప్రిల్ 9వ తేదీన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మెహబూబా ఘాట్స్ వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరాబీ గ్రామానికి చెందిన బావ బామ్మర్దులు నాందేవ్, శ్రీకాంత్ మృతి చెందారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఇచ్చోడవైపు వెళ్తున్న నాందేవ్, శ్రీకాంతుల ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. నాందేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.'

'ఫిబ్రవరి 6వ తేదీన ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బోల్తా పడింది. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ వెళ్తున్న ఈ బస్సు డ్రైవర్ సదేష్‌కు ఛాతిలో నొప్పి రావడంతో బస్సులో నుంచి దూకేశాడు. ఈ బస్సు అదుపు తప్పడంతో కండక్టర్ శ్రీనివాస్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కేవలం ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.'



ఆర్టీసీ బస్సు తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన బాతూరి గంగారాం (ఫైల్)

- పెరిగిపోతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాలు
- వరుస డ్యూటీలతో డ్రైవర్లపై ఒత్తిడి
- కానరాని శిక్షణ తరగతులు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. శుభప్రదం... ఇది ఆర్టీసీ సంస్థ నినాదం. సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారనే ప్రశంసలు సంస్థకు ఉన్నాయి. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించడం కన్నా ప్రజా రవాణా వ్యవస్థ అయినా ఆర్టీసీ బస్సుల్లో నిర్భయంగా తమ ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రయాణికులు మొగ్గు చూపుతారు. గత కొన్ని నెలలుగా ఈ పరిస్థితిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఆదాయమే పరమావధిగా సంస్థ ముందుకు సాగుతూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకు వస్తున్న కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయనే చర్చ సంస్థలోనే అంతర్గతంగా బాహాటంగా సాగుతోంది.

ఆదాయార్జనే పరమావధిగా...

నష్టాల బాటలో పయనిస్తున్న సంస్థను లాభాల బాటను పట్టించే క్రమంలోనే ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆదాయ ఆర్జనకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాల్సిన ఆర్టీసీ అధికారులు డ్రైవర్లు, కండక్టర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. డ్రైవర్ల విషయానికి వస్తే కేఎంపీఎల్ సాధించాలని వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్, విజయవాడ, గుంటూరు లాంటి దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసుల్లో టిమ్ డ్రైవర్లను నియమిస్తున్నారు. వారిపై ఒత్తిడి పెరుగడంతో డ్రైవింగ్‌పై దృష్టి నిలపలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

అద్దె బస్సులూ కారణమే...

నిర్వహణ ఖర్చులను తగ్గించుకుంటూ ఇన్‌కం పెంచుకోవాలని భావిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందిని ప్రత్యక్షంగా, పరోక్షంగా తొలగించి వేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రైవేట్ హైర్ బస్సులను పెద్ద సంఖ్యలో పెంచుకుంటూ నూతన బస్సులను సమకూర్చుకోవడాన్ని నిలిపివేసింది. దీంతో ప్రైవేట్ హైర్ బస్సు యజమానులు ఖర్చులను మిగిల్చుకునే ప్రయత్నంలో అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తున్నారు. డ్రైవర్లపై పర్యవేక్షణ, వారికి తగిన శిక్షణ లేక ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



నేరడిగొండ బంధం క్రాసింగ్ వద్ద ఆర్టీసీ బస్సు, వాటర్ ట్యాంకర్ ప్రమాదంలో బస్సు..



బోథ్ క్రాస్ రోడ్ వద్ద ఆర్టీసీ బస్సు కారు ప్రమాద దృశ్యం

సేఫ్టీ వార్డెన్లను నియమించాం



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో బస్సు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ డిపో పరిధిలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి సేఫ్టీ వార్డెన్లను నియమిస్తున్నాం. అద్దె బస్సు డ్రైవర్లకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నాం. ఇతర వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నాం.

– జానీ రెడ్డి, ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం

మరికొన్ని ఘటనలివీ...

- ఫిబ్రవరి 18వ తేదీన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని బంధం క్రాసింగ్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సు వాటర్ ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ పరస్పరం ఢీకొట్టుకోవడంతో ఇద్దరు ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి.
- మార్చి 13వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సమీపంలోని జాతీయ రహదారి 44 పై ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు నాగ్‌పూర్ వైపు నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.
- ఏప్రిల్ 18వ తేదీన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని ఘాట్లపై ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని డీజిల్ ట్యాంక్ పగిలి కారు పూర్తిగా దగ్ధమైంది. కారుకు మంటలు అంటుకోగా కారు యజమాని పవన్‌కుమార్ అందులో నుంచి బయటకు దూకేశాడు. బస్సు డ్రైవర్ పై కేసు నమోదైంది.
- మే 8వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి నేరడిగొండ మండలం తేజపూర్ వైపు వెళ్తున్న కారును బోథ్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి, బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



కెరమెరి ఘాట్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దగ్ధమవుతున్న కారు

కాంగ్రెస్ నాయకుల కొట్లాట..



సెల్ఫీరాడ్‌తో కాంగ్రెస్ కార్యకర్త



ప్రశాంత్ చెవిలోంచి కారుతున్న రక్తం

- సంబరాల్లో బాహాబాహీ
- జిల్లా నేతల సమక్షంలోనే ఘటన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇద్దరు బాహాబాహీకి దిగారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలోని వినాయక్ చౌక్‌లో శనివారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చే క్రమంలో పట్టణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల ప్రశాంత్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షకీల్, ఆయన సోదరుడు ముఖీమ్‌లు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. సంఘటన స్థలంలో ఉన్న వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ప్రశాంత్ సోషల్ మీడియాలో కాంగ్రెస్‌లో చేరిన నాయకుడికి వ్యతిరేకంగా పోస్ట్ పెట్టాడు. దీంతో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు నగేశ్ ఈ విషయంలో వారించాడు. విషయం మూడు రోజుల క్రితం జరిగింది. ఈ పోస్టులపై కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ షకీల్ ఎందుకు పోస్టులు పెట్టావని ప్రశాంత్‌కు ఫోన్ చేయగా, అతను దురుసుగా మాట్లాడారని తెలిసింది. శనివారం సంబరాల సమయంలో షకీల్ సోదరుడు సెల్ఫీ రాడ్‌తో దాడికి దిగాడు. దీంతో ప్రశాంత్‌కు చెవిలోంచి రక్తం వచ్చింది. అక్కడున్న వారు వీరిని విడిపించి గొడవ సద్దుమణిగించారు. ఆ తర్వాత ప్రశాంత్ వన్‌టౌన్‌లో షకీల్, ఆయన సోదరుడిపై ఫిర్యాదు చేశాడు. కాగా, ప్రశాంత్‌ను కులం పేరుతో దూషించినందుకు షకీల్, ఆయన సోదరుడు ముఖీమ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి.. కుమారుడికి గాయాలు






జాదవ్ మనీశ్ మృతదేహం, గాయాలపాలైన కుమారుడు లోకేశ్

భైంసారూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతిచెందగా కుమారుడికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. కుంటాల మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన జాదవ్ మనీశ్(35) టెంట్‌హౌజ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన కుమారుడు లోకేశ్‌తో ద్విచక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ సుంక్లి గ్రామ సమీపంలో వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మనీశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాలపాలైన లోకేశ్‌ను 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శుభకార్యానికి వెళ్లి అనంత లోకాలకు...

- విద్యుత్‌షాక్‌తో వ్యక్తి దుర్మరణం



జాదవ్ విజేష్ మృతదేహం

సారంగపూర్: అత్తవారి ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిన విషాద ఘటన మండలంలోని బోరింగ్ తండాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని మహావీర్‌తండాకు చెందిన జాదవ్ విజేష్(40) శుక్రవారం మండలంలోని బోరింగ్‌తండాలో తన అత్తగారి ఇంటికి శుభకార్యం నిమిత్తం కుటుంబ సమేతంగా హాజరయ్యాడు. అయితే అక్కడ తనకు మరో సమీప బంధువు సక్కారాం ఇంటి స్లాబుపై భోజనం చేయడానికి వెళ్లాడు. స్లాబుకు అమర్చిన ఇనుప చువ్వలకు ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో వాటికి తగిలిన విజేష్ విద్యుత్‌షాక్‌కు గురై పక్కనే రేకులపై పడిపోయాడు. గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ తెలిపారు.

మొక్కజొన్న దగ్ధం

కుంటాల: మండలంలోని అందకూర్ శివారులోని పడకంటి దత్తాత్రి అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం... పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నందున నిప్పురవ్వలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దత్తాత్రి కుమారుడు అదే సమయంలో పంట చేనులోకి రాగా ప్రమాదంలో మొక్కజొన్న కాలిపోతుండడం గమనించి మంటలు ఆర్పివేసినా ఫలితం లేక భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. వారు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎకరంలో మొక్కజొన్న పంట సాగు చేయగా ఈ ప్రమాదంతో అర ఎకరంలో పంట నష్టపోయిందని, రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు దత్తాద్రి వాపోయాడు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామానికి చెందిన సుధాకర్(49) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... సుధాకర్‌కు పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలుకు దెబ్బతగిలి కోలుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదుకుందాం... బతుకునిద్దాం

- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- ఆపరేషన్‌కు రూ.3లక్షల ఖర్చు
- ఆసుపత్రికి వెళ్లడానికి డబ్బుల్లేని పరిస్థితి
- కొడుకును బతికించాలని వేడుకుంటన్న తల్లి



మంచంపై నల్ల సతీశ్

బోథ్: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న తన కొడుకుని బతికించాలని ఆ తల్లి చేతులెత్తి వేడుకుంటోంది. పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆపరేషన్ చేయాలని, వైద్య ఖర్చులు సుమారుగా రూ.3లక్షలు అవుతాయని వైద్యులు తెలిపారు. రెండు నెలలుగా డబ్బులు లేక ఆపరేషన్ చేయించలేక అలానే ఉండిపోయింది. కళ్ల ఎదుట కన్నకొడుకు చూస్తూ ఆపరేషన్ చేయించలేని పరిస్థితిలో ఉన్న ఆ తల్లి గుండె తల్లడిల్లుతోంది. తన కొడుకును కాపాడాలని వేడుకుంటోంది.

కడుపేద కుటుంబం...

బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నల్ల సతీశ్(30) బతుకుదెరువు కోసం 2020లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో ఛాతిలో నొప్పి మొదలైంది. అక్కడ వైద్యం చేయించుకోలేక తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడ పనిచేసే పరిస్థితి లేక 2022లో ఇండియాకు తిరిగివచ్చాడు. ఛాతిలో నొప్పి తరచూ వస్తుండడంతో నిజామాబాద్, హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షించుకున్నాడు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి ఉందని, ఆపరేషన్‌కు రూ.3లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అప్పటికే దాదాపు తల్లి రూ.లక్ష వరకు ఖర్చు చేసింది. మరో 3లక్షలు రూపాయలు ఎలా తేవాలో అర్థం కావడం లేదని ఆ తల్లి మదన పడుతోంది. ఆపరేషన్ చేయించలేక తన కొడుకుని ఇంటి వద్దే ఉంచింది. కనీసం ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా ఆర్థిక స్తోమత లేక ఆందోళన చెందుతోంది. దాతలు స్పందించి తన కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటోంది.

దాతల సాయం కోసం..

ఫోన్ పే నంబరు :
8008788420 (నల్ల మధుకర్)

బ్యాంకు అకౌంటు వివరాలు:
నల్ల సతీశ్, అకౌంట్ నంబరు :
209110100050899
యూనియన్ బ్యాంక్ (ఆంధ్రాబ్యాంక్),
IFC CODE: ANDB0002091
BQANCH: BOATH

నా కొడుకును బతికించండి..



నా కొడుకుకు ఆపరేషన్ చేయించే స్థితిలో లేను. నా కొడుకును బతికించాలి. ఆపరేషన్ కోసం రూ.3లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఇప్పటికే లక్ష రూపాయలు అప్పుతెచ్చి టెస్టులు చేయించాను. మూడు లక్షలు ఉంటే నా బిడ్డ బతుకుతాడు. దయచేసి సాయం అందించి నా కొడుకును కాపాడాలి.

– నల్ల గంగుబాయి, సతీశ్ తల్లి

రేషన్‌డీలర్‌ను బహిష్కరించిన గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీలో నూతనంగా నియమించిన రేషన్ డీలర్‌ను గ్రామస్తులు బహిష్కరించి రేషన్ దుకాణానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో రేషన్ దుకాణ డీలర్‌గా పనిచేసేందుకు అర్హత ఉన్న స్థానికులను కాదని, స్థానికేతరులను నియమించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శనివారం నూతనంగా నియామకమైన డీలర్ గ్రామంలోకి వెళ్లడంతో ఆమెను గ్రామం నుంచి వెళ్లగొట్టారు. గ్రామంలో అర్హత ఉన్న వారిని డీలర్‌గా నియమించాలని గ్రామస్తులు తీర్మానించారు.



డీలర్‌ను పంపిస్తున్న గ్రామస్తులు